# బ్రాం॥ పో॥ మా॥ లేఖలు

శ్రీ మాచిరాజు

౧

చంచు లక్షమ్మ
గార్కి—

మీరు అప్పడం రామసుబ్బమ్మకు వ్రాసిన కార్డు నాదనుకోని పొరపాటున సగం చదివాను. సగం చదవంగానే నాదికాదని రూఢిగా తెలిసినా మిగతా సగం చదివాను. మజ్యలో మీరిచ్చిన బంగాళా దుంపల 'చిప్సు' వర్ణన నానోట్లో నీరూరించడమే యీ విపత్తుకు కారణం. మా ఆవిడకు వాటి తయారీ బోధించి, నిన్న సాయంత్రం మా అత్తయ్యను సహాయంచేసి వండించాను. నేను అక్కడే కూర్చొని—మీ లేఖాసమేతంగా ప్రాష్టు చేసాను.

అవి అచ్చం మీరన్నంత బాగుండకపోయినా మాడిన బంగాళా దుంపల వేపుడులాగా వున్నయి. కాని వేపుడు ముక్క కొంచెం లావుగా వుంటుంది. ఇది సన్నగా వుండి చిక్కిపోయిన వేపుడు ముక్క అనిపిస్తుంది.

బ్రాంచి పోష్టు మాష్టరు
భద్రోజ పాలెం.

మొన్న పట్నంలో శ్రీకృష్ణా లన్చ్ హోమ్‌కు వెళ్ళే అదృష్టం లభించింది. వాడు ఏకరవు పెట్టిన దాన్లొ బోండా అర్ధమవడం మూలాన్ని—నాపేరు బదులు చాలామంది దాన్నే వాడుతుంటారు లెండి?—దాన్ని తెమ్మన్నాను. దాని మాటంటే నాకిప్పటికీ ఆశ్చర్యమే. లోపల బంగాళా దుంపల కూర ఉంది. పైన మామూలుగానే పిండిపొర ఉంది. ఆ కూర ముద్ద, తోషల ఉంచి చెయ్యిపై పిండి బెరడు పగలకుండా ఎలా తీసేస్తారా అన్నది యిప్పటికీ సందేహమే. దీన్ని తీర్చినచో మీకు ఆ జన్మాంతరం కృతజ్ఞుణ్ని. సుబ్బమ్మగారి ఉత్తరం వాటి పద్ధతులు రాసుకోని రేపు బట్వాడా చేస్తాను,

౨

'చిత్రగుప్త'
సంపాదకులకు

ఆర్యా,

మీ పత్రిక రాంగానే నాకు కనబడే వస్తువు మీఅట్ట వెనుక 'అతి కోమలములయిన ఆమే వ్రేళ్ళ వీణాతంత్రులమీద' అన్న బొమ్మ. ఆమె అచ్చంగా నాప్రధమ భార్యలా వుందంటే నమ్మండి. అది చూడంగానే 'రాగసుధారసం' మాట యెలా తగలడ్డా ఆమె బడిత తంత్రులతో నావీపు వీణెమీద వాయించే 'రావ సుధారసం' జ్ఞాపకంవచ్చి బేజారెత్తి పోతుండేవాణ్ణి. అది 15 రోజుల కొకసారి జరుగుతుండేది, కాని యిప్పుడు 'అనురాగసుధామయ జీవనము' బొమ్మ మార్చినందుకు జనవరి 15 నుంచి మీకెంతయూ కృతజ్ఞుణ్ణి. ఆ బొమ్మ తిరిగి రాకుండుటకై ఆంజనేయులకు ఆకుపూజచేయించిన.

౩

పిలకమ్మగారి
లలితమ్మకు—

మీరు మీఆయనకువ్రాసిన కవరు అతికించకపోవడంమూలాన్న కామోసు నేను లోపల చూడాల్సినఅగత్యంలోకి వచ్చాను, మీముఖం చూస్తే మాట అలాఉంచి మీఅక్షరాలుచూస్తే యీ రాసింది మొగవాడా అనిపిస్తుంది. మీరు సంతకంకూడా చేయగలరూ! ఇన్నాళ్ళ మట్టీ వ్రేలుముద్దరేమో అనుకొంటున్నా. అందుకు నిజంగా ఆంధ్ర న్నారీలోకం గర్వించాల్సిందే.

ఈవూళ్లో ఒకచిన్న కలకలం లేవదీసారు. ఇక్కడ నేజేసే పని Runner కంటె ఏమీలేదుట. అందుచేత నన్ను Runner Without running అని నిర్వచించారు. ఈ అలజడి లేవదీసిన వారిలో ముఖ్యులు మీవారు. దీనికై వచ్చేఉత్తరంలో ఆయన్నికొంచెం కోప్పడి—(మీరు తప్ప బ్రహ్మదేవుడు చెప్పినా వారు వినరు)—నాకు సహాయం చేస్తారని నమ్ముతున్నాను. అంతే కాకుండా రెండు నెలల క్రిందట నాదగ్గర రెండు కార్డులు తీసికోని యెగ్గొట్టిన 0-1-6, అక్షరాలా సున్నారూపాయీల ఒక అణా ఆరు పైసలు మాత్రమే, యిప్పిస్తారని ప్రార్థించుతూ ఉత్తరం ముగించు

బ్రాం॥ పో॥ మా॥

౪

కవిసార్వభౌమ

వికటకవితా దురంధర అభినవ రాయలింగ బిరుదాంకిత సుబ్బిరాట్కవీశ్వరుల చరణ సన్నిధికి—

కవి మణీ,

మీరు 'బుక్ పోస్టు'లో పంపించిన మీ ప్రబంధం వ్రాత ప్రతి సురక్షితముగాచేరి మా ఆఫీసులో నిలబడిపోయింది. కారణంపైన అడ్రసు వ్రాసి చుట్టిన కాగితం ఊడి పత్తా చిక్కకుండా పోవటమే. దాన్ని రోజూ కొంచెం కొంచెం చదువుతున్నాను. ఇన్నాళ్ళబట్టి భారతంలో స్వర్గారోహణపర్వం ఖాళీ ఉన్నప్పుడల్లా చదువుతుండే వాణ్ణి, ఇప్పుడు మీ కవిత్వం చదువుతూంటె నిజంగా ఆకాస్తా ఆరోహణ చేసినట్టే ఉంది.

మీశైలి అమోఘం. మీరచనా కౌశలం అనన్య సాధనం. కాని మీవ్రాత బ్రహ్మకైనా దుర్భరం.

మీ
బ్రాం॥ పో॥ మా॥

Bodh

మీరు ద్వితీయాస్వాన మధ్యమంలో యిచ్చిన ఆంజనేయుల వర్ణన పూర్తిగా చదివాను. అప్పుడే కామోసు ఊగ్రం పెరిగి మనియార్డరు కట్టటానికి వచ్చిన ఒక నిశాచరుణ్ని తన్నబోయాను కూడా. వర్ణన మాట అలా ఉంచి అంజనీ పుత్రునితోక 1½ గజమే ననటం తీరని లోపం, ద్రోహం కూడాను. అది యెంతో నాకు సిసలుగా తెలియకపోయినా యింతకంటే పొడుగ్గామటుకు ఉండాలని నాదృఢ విశ్వాసం.

మొన్న మనం కలుసుకొన్నప్పుడు సగం చెప్పిన
ఆ॥ వె॥ బ్రాంచి పోష్టు మాష్టరి బఅక మొదలుపెట్ట
కొండ విరిగినంత గోలపుట్టు
పద్యం పూర్తి చేసారా ?

ఇట్లు
బ్రాం॥ పో॥ మా
భద్రోజ పాలెం.

౫

చంచురెడ్డి
రైతులకు—

రెడ్డి ప్రభో : మాదొడ్డ ప్రభో !

మీరు రామిగాడిచేత పొగాకు చుట్టి పంపించిన పై కాగితం చేరింది. లోపల పొగాకంతా వాడు దారిలో స్వంతానికి ఉపయోగించాడుట. ఆ వెధవచేతికి యెందుకిచ్చారండి ! Not Paid లో వేసినా లక్షణంగా తీసుకోనుండేవాణ్ని.

మీరు యీవూళ్ళో మీ తమ్ముడికి వ్రాసిన ఉత్తరాలు చేరటం లేదని కబురంపించారు. అడ్రసు రాయటానికి మీరుపయోగించే అక్షరాల్లో ఏముందోగాని, అడ్రసు ఎవరికో అర్థంకాకపోవటం అలా ఉంచి యీభాష భూమిమీద ఉన్నదా అనిపిస్తున్నది, మీ ఉత్తరం ప్రతీది చచ్చిన ఉత్తరాల కచేరికి (ఇది D. L. O కు నేను ప్రత్యేకంగా కనిపెట్టి ప్రచారంలో పెడుతున్న తర్జుమా. ఇలాగే Book-post ని తెనుగులో, పుస్తక-తపాలా, అన్నాను) వెళ్ళి యీవూరు చేరుతుంది.

అది యీవూరు చేరేటప్పటికి అడ్రెసు నిండా ముద్దరలు పడటంవల్ల విలాసం మూసుకుపోయి చదవబోతే కైలాసం అగపడుతుంది. కనుక దాన్ని మళ్లీ నేను చచ్చిన కచేరికి తరుముతున్నాను. హే! రెడ్డీజీ! మీరు కార్డుకు 0-0-9కాదు 0-1-6 వేసినా పోస్టు వాళ్ళ శ్రమకు ప్రతిఫలం దక్కదుసుమ్మండీ!

అలాంటివి మీవని నాకు యింతకు ముందు గాలి కబురు తెలిసినా మీతమ్ముడిగారికి దాఖలా చేసిఉందును. ఇవ్వాళ D. L. O. నుంచి అలాంటిది ఒకటి వచ్చింది. అది వెంటనే మీవాడి ఇంటికి పంపించాను (మనలోమనమాట నేనే యిచ్చి వచ్చా లెండి)

బ్రాం॥ పో॥ మా॥

*   *   *

మీవాడు అది నాది కాదంటున్నాడు. ఎవతో వెధవ ముండకు చచ్చిపోయిన మొగడు వ్రాసిందిలాగఉందిట. చచ్చిన ఉత్తరాల కచేరినించి చచ్చినాళ్ళ ఉత్తరాలురాక మరి ఏమైతె.

ఇక్కడ వంకాయలు సవాశేరు 0-0-9
అక్కడ ఎలా ఉన్నటు?

---

౬

రామకృష్ణారావు, బి. ఎ. ఎల్ టి.
లెక్కల బడిపంతులు

ఏమయ్యోయ్ అలారాస్తున్నావు మొన్న మీవాడికి ఉత్తరంలో. నన్నుగురించి జాగర్తగా మాట్లాడు. నీదగ్గర రెండో ఫారం మూడో యేడు తప్పినప్పుడులా ఉందనుకొన్నావాయేం నాలెక్కల సంగతి? బడిని, దాంతో మిమ్మల్ని, వదలిపెటిన ఉత్తర క్షణమే ఈ బ్రాంచి పోష్టు మాష్టరి మహాశయుడిలో గొప్ప మార్పు బయలుదేరింది. అది పెద్దదై దరిమిలా పుష్పించి, వికసించి సౌరభము వెదజల్లనారంభించింది. నాకు లెక్కలలో తడుతున్న ఈక్రొత్త పద్ధతులు చూస్తే నాకు యెక్కడ నోబెల్ ప్రైజు (Noble priz๑) వచ్చిపడుతుందో అన్న భయమేస్తున్నది. ఈక్రిందివి నేను కనిపెట్టినవే.

0-1-6 పోస్టు కవరు—0-1-6 తపాలా బిళ్ళ
=ఖాళీ కవరు.

అనగా రెండు సమానమైన వస్తువులను ఒకదానినుంచి ఒకటి తీసివేయగా వచ్చునది సున్నా కాదు. ఖాళీ కవరు అన్నమాట.

మఱియొకటి:

4 కార్డులు = 0-3-0.
2 కవర్లు = 0-3-0.
* 4 కార్డులు = 2 కవర్లు.
* 2 కార్డులు = 1 కవరు.
కాని 2 కార్డులు = 2 + 0-0-9.
= అరవీశ వంకాయలు (చూ. ౫ వ. లేఖ)
1 కవరు = అరవీశ వంకాయలు.

=అనగా 1 కవరులో అరవీశ వంకాయలు పట్టవలయునుఅని తీర్మానము. ఇలాగే ఇంకో ఉపపత్తితో (Book-post) బుక్‌పోస్టులో సొరకాయ పట్టే విధానం చెప్పగలను కాని యిప్పటికి ఎందుకులే అని ఊరుకొంటున్నాను.

బ్రాం॥ పో॥ మా॥

౭

బ్రాంచి పోష్టు మాష్టరిణికి
బ్రాంచి పోష్టు మాష్టరు వ్రాయు
సల్లాపములు.

హృదయ రాజ్ఞి,

నీవు పోయిన నాటినుండి అనేక యిడుమల పాలగు చుండియు నీవు అచటికి వెళ్ళిన దాది అన్నంబునకు నాల్గు పక్షంబులగుట తప్ప వేరొండు పనిలేదు. నన్ను అపరాహ్ణ సమయాన నోటార తిట్టువారలు లేకుంటం చేసి ఏమియుం తోచుటలేదు. అది యుంగాక నిన్న తపాలా డబ్బాలో ఉత్తరాలు తీయంబోవు సమయంబును లోపల దాక్కొన్న తేలు రెండు కరకమలంబులపైనే

ర

యేకకాలంబుననే అంటంబొడచె. ఎవరెవరో దుండగీంద్రు బతికి యున్న తేలుకి కొండీ త్రాడు బిగించి పోస్టుపెట్టెలోనికి ప్రవేశ పెట్టిరి.

హృదయేశ్వరీ! గూండాలను నిరోధింపుము.
అరసున్నాలు వాడమికి మన్నింపంగదే!

నీ
కటిక గ్రాంధికపు
బ్రాం॥ పో॥ మా॥

ర

లక్ష్మి
క్యూన్ మేరీ కళాశాలగారికి

మహిళామణీ,

మీ ప్రియుబు యీవూరి వాస్తవ్యులు రామారావుగారి పుత్రులు కుశలవరావు. యమ్. ఎ. (తప్పిన) గారు మీకు వ్రాసిన ప్రేమలేఖ ఉబ్బిఉండటం మూలాన్ని లోపల యేవన్నా ప్రేలుడు ద్రవ్యాలున్నాయేమోనని దే. ర. చట్టంక్రింద విప్పిచూచాను. అలాంటి ప్రమాద వస్తువులు లేకపోయినా వారు మీకు 'ప్రేమతో' అని పంపించుతున్న చిన్నఫొటో ఒకటుంది. అది నిజంగా ఉండాల్సినంత బాగుండకపోవటంవల్ల దాన్నితీసేసి మాకుక్క ఫోటో ఒకటి తస్థానే జారీచేస్తున్నాను. చేరినట్టుగా ఉత్తరం వ్రాయించగోరుతాను.

బ్రాం॥ పో॥ మా॥
భద్రభోజపాలెం.

## నాకేం?—నీకేం?

నీ
విశాలవక్షంలో
ఒళ్లుతెలియక
కళ్లు విప్పక
నే
నిదురించిన
పక్షంలో ల
లోకంలో
ఏమైతే నాకేం
నీకేం?

*  *  *

నీ
కనుపాపల
కాటుకలా
మసిపూసిన
ఈ
కటికచీకటిలో
నే
లోలోపల
మండిపోతె
నీకేం—నాకేం?
ఆ
అనంత ఆకాశం
లో
విహరించే
విహంగాల్లా
నా
హృదయంలో
విహరిస్తున్నై
వింత—వింత
విషపాలోచనలు!

*  *  *

మోడైనా—మొండైనా
నశించినా—కృశించినా
ఎన్నైనా సహించి
వహించిన
నీ
బండమొండి
ధైర్యానికి
ఆర్చి—ఓర్చి
కార్చిన కన్నీరే
లోకపు పన్నీరు!
నీ
కన్నెపెదవుల
చిర్నగవులా
చిందులాడే
ముద్దుమాటలు
నా
లేతగుండెలు
చీల్చుకుంటూ
వేడినెత్తురు
పీల్చుకుంటూ
ఆడుకున్నాయ్
పాడుకున్నాయ్!

'మహేశ్వర్'